## అవయవ లోపం బలహీనత కాదు..

# మనోధైర్యంతో చరిత్ర సృష్టించండి...

-దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది..
-బడ్జెట్‌లో దివ్యాంగులకు పెద్దపీట.. రూ.1600 కోట్లు కేటాయింపు
-కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

అవయవ లోపం శరీరానికే తప్ప సంకల్పానికి కాదని, మనోధైర్యంతో ముందడుగు వేస్తే వైకల్యాన్ని జయించి చరిత్ర సృష్టించవచ్చని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో దివ్యాంగుల సహాయక ఉపకరణాలను పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.

ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, శరీర అవయవాలు సరిగ్గా లేకపోయినా మనోధైర్యంతో చరిత్ర సృష్టించిన మహనీయులు ఎందరో ఉన్నారని అన్నారు . కంటి చూపు లేకపోయినా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన దివ్యాంగులు మనకు స్ఫూర్తిప్రదాతలని పేర్కొన్నారు. మనిషి కేవలం శరీరంతోనే కాకుండా, అంతకు మించి మనసుతోనూ, ఆత్మవిశ్వాసంతోనూ విజేతగా నిలవగలడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటమి అనేది శరీరానికి కాదు, మనసుకు కలిగినప్పుడే మనిషి కుంగిపోతాడని, తనపై తనకు నమ్మకం ఉన్న రోజున జీవితం కొత్త మలుపు తిరుగుతుందని అన్నారు.




దివ్యాంగుల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం మూడు రెట్లు అధికంగా బడ్జెట్ కేటాయిస్తున్నామని ,ఈ ఏడాది కేవలం దివ్యాంగుల కోసమే రూ.1600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఏడీఐపీ , అలీం కో వంటి పథకాల ద్వారా కేవలం పరికరాలు అందించడమే కాకుండా విద్య, ఉపాధి, డిజిటల్ ఐడీ, యాక్సెసిబుల్ ఇండియా మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం ముందుందని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటివరకు దివ్యాంగుల కోసం రూ.100 కోట్లకు పైగా వెచ్చించినమని అన్నారు .



మహిళలు, వృద్ధులు మరియు చిన్నారుల సంక్షేమం కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు . అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారానికి కేంద్రమే నిధులు సమకూరుస్తోందని, తద్వారా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు . సిరిసిల్లలో ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా పంపిణీ చేసే ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని, దివ్యాంగులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. 'సుగమ్య భారత్ – స్వశక్త భారత్' లక్ష్యంలో భాగంగా దేశ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు . జిల్లాలోని ఆరు శిబిరాల ద్వారా అర్హులను గుర్తించి ఈ సహాయక పరికరాలను అందజేస్తున్నామని, ఇవి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు .

ఉపాధి కల్పనలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెట్రోల్ బంక్‌లో 10 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. అలాగే, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని యూడీఐడీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, ప్రతి నెలా వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు . దివ్యాంగులు ఈ సౌకర్యాలను వాడుకొని స్వశక్తితో ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి. గితే మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి,ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ఎక్కడా జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు తీరుపై ఆరా తీశారు.?అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని అన్నారు . రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పారదర్శకతతో కొనుగోళ్లు సాగాలని పేర్కొన్నారు.

?ఈ తనిఖీ కార్యక్రమంలో కలెక్టరుతో పాటు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్ కుమార్ మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# అన్ లోడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి..

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని కలెక్టర్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారంలోని

కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. ధాన్యం రాశులు, కొనుగోలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

హమాలీల సంఖ్యను పెంచాలి

రైస్ మిల్లర్లు తమ మిల్లులో హమాలీల సంఖ్యను పెంచి కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే దాన్యం లారీలను అన్ లోడింగ్ చేయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఇల్లంతకుంట మండలం చింతలకుంటపల్లి లోని లక్ష్మి సాయి రైస్ మిల్లు, తాళ్ళపల్లి లోని రాజ రాజేశ్వర రైస్ ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# బోయినిపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు పూర్తి..

**బలగం టీవీ, బోయినిపల్లి**

ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025-26లో భాగంగా వ్యక్తిగత రుణాల మంజూరీ కోసం బుధవారం బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్.శరత్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 118 మందికి గాను 89 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. బోయినిపల్లి మండలంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.జయశీల, ఏఓ ప్రణీత, వెటర్నరీ డాక్టర్ శ్రీధర్, ఏపీఎం పవన్ కుమార్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ముందస్తు అరెస్ట్

**బలగం టీవీ, సిరిసిల్ల:**

గురువారం రోజున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం జరిగింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతలను అణిచివేయడం సరైంది కాదని, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.



## బీఆర్ఎస్ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి ముందస్తు అరెస్ట్..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి ను గురువారం రోజున పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బండి సంజయ్ పర్యటన సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలలో భాగంగా పోలీసులు ఈ అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఉదయం నుంచే జిందం చక్రపాణి నివాసం వద్దకు చేరుకున్న పోలీసులు, ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పోలీసుల చర్యలను ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం అన్యాయమని వారు ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ అరెస్ట్ జరిగిందని విమర్శించారు.



## భక్తి నిండిన గుండె.. కోనేటిలో ఆగిపోయింది..

-నీటిలో మునిగి హనుమాన్ మాలధారి మృతి

**బలగం టీవీ, గంభీరావుపేట :**

భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకుందామని వచ్చిన ఆ యువకుడిని కాలం కనికరించలేదు. హనుమాన్ దీక్షలో ఉండి తోటి స్వాములతో కలిసి ఆలయ దర్శనానికి వచ్చిన ఓ యువకుడు, కోనేటిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన మల్లారెడ్డిపేటలో తీవ్ర విషాదాన్ని నింపింది.?స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంచనూరు గ్రామానికి చెందిన నీరాడి సత్యనారాయణ కుమారుడు వినయ్ (16) సిద్దిపేటలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. ఇటీవల హనుమాన్ దీక్ష చేపట్టిన వినయ్, బుధవారం సాయంత్రం మరో ఎనిమిది మంది స్వాములతో కలిసి గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలోని హనుమాన్ దేవాలయ దర్శనానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆలయముందున్న కొలనులో స్నానం ఆచరించేందుకు వినయ్ నీటిలోకి దిగాడు. అయితే అతనికి ఈత రాకపోవడం, ఒక్కసారిగా నీట మునిగిపోయాడు.తోటి వారు గమనించి కాపాడేలోపే వినయ్ ఊపిరి ఆగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికి అందొచ్చిన కుమారుడు కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.




## ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడిగా మందాటి రాము

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల ఉప సర్పంచ్ల ఫోరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ జెడ్పిటిసి కార్యాలయంలో దీక్షూ మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు, మండల అధ్యక్షుడు వరుస కృష్ణ హరి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా రాగట్లపల్లి ఉప సర్పంచ్ మందాటి రాము యాదవ్, ఉపాధ్యక్షుడు గణగోని ధర్మ గౌడ్, ధరావత్ లాస్య, రామవత్ మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రాజు, క్యాషియర్ గుర్రం విశక్, గౌరవ సలహాదారులుగా బంధారపు బాల్రెడ్డి, జి మోహన్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా గొట్టె శ్రీకాంత్, కొర్రి అనిల్ కుమార్, గోపన్న గారి కొమురయ్య, మందాటి బాబు, మునిగే రేణుక దేవేందర్, జెల్ల ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి మండల అధ్యక్షుడు మందాటి రాము ధన్యవాదాలు తెలియజేశారు.



## అనంతారం గ్రామ పంచాయతీ ఆవరణలో చలివేంద్రం

**బలగం, టీవీ ఇల్లంతకుంట**


ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం స్థానిక సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలం మండుతున్న ఎండల దృష్ట్యా గ్రామ పంచాయతీ కి వచ్చే ప్రజలకు, అధికారులకు,బాటసారులకు దాహర్తి ని తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ కదం జయంత్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని శ్రీ శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి దేవాలయ 16వ వార్షికోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళా చక్రపాణి మాట్లాడుతూ, భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా ముత్యాల పోచమ్మ అమ్మవారు నిత్యం పూజలందుకుంటున్నారని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు చైర్‌పర్సన్‌ను ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, కూర భాగ్యలక్ష్మి, అడిచెర్ల రూపా సాయి, గెంట్యాల శ్యామల, మంచే రేణుక, పాషికంటి రమ్య, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కోడం సంజీవ్, ఎలగందుల శంకర్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## రెండు దశాబ్దాల తర్వాత అపురూప కలయిక..

బోయినిపల్లిలో పూర్వ విద్యార్థుల సందడి

**బలగం టీవీ, బోయినిపల్లి:**

సరిగ్గా 21 ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో పాఠాలు విని, భవిష్యత్తు కలలతో విడిపోయిన ఆ నేస్తాలంతా మళ్లీ ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా జరిగింది. చదువు పూర్తిచేసి విడిపోయిన వీరంతా, మళ్లీ తాము ఎక్కడైతే విడిపోయారో అక్కడే కలుసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం.? పూర్వ విద్యార్థి కన్నం సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం కావడంతో ఒకరినొకరు "నన్ను గుర్తుపట్టావా?" అని ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. వయసు రీత్యా వచ్చిన మార్పులను పక్కన పెట్టి, పాఠశాల రోజుల్లో తాము చేసిన అల్లరిని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంలో మునిగితేలారు. తమ ప్రస్తుత ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ వివరాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ గడిపారు.?తమను ఉన్నత శిఖరాలకు చేర్చిన గురువులను విద్యార్థులు మర్చిపోలేదు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. వారి ఆశీస్సులు తీసుకుని, గురువులను ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారందరం 21 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి రావడం వెలకట్టలేని ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ కలయిక కేవలం పలకరింపులకే పరిమితం కాకుండా, చిన్ననాటి మిత్రుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

# కరీంనగర్‌లో రాజకీయ రణం



## 800 ఏళ్ల కాకతీయ శివాలయ కూల్చివేతపై ఆగ్రహం..

**సమీకృత పాఠశాల నిర్మాణం పేరిట చారిత్రక వారసత్వానికి నష్టం : తెలంగాణ చరిత్ర బృందం**

**బలగం టీవీ, వరంగల్:**

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్ ప్రాంతంలో కాకతీయ రాజు గణపతిదేవుడి కాలంలో సుమారు 800 ఏళ్ల క్రితం నిర్మించబడిన పురాతన శివాలయాన్ని సమీకృత పాఠశాల నిర్మాణం పేరుతో బుల్డోజర్‌లతో కూల్చివేయడం తీవ్ర అన్యాయమని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉన్న ఈ చారిత్రక దేవాలయం తెలంగాణ సంస్కృతి, చరిత్రకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. అలాంటి వారసత్వ కట్టడాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండగా, అభివృద్ధి పేరుతో కూల్చివేయడం బాధాకరమని అన్నారు. కాకతీయుల వైభవానికి గుర్తుగా నిలిచిన ఈ శివాలయం ధ్వంసం కావడం తెలంగాణ చరిత్రకు మచ్చ అని హరగోపాల్ పేర్కొన్నారు. చారిత్రక కట్టడాల పరిరక్షణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని పురాతన దేవాలయాలు మరియు చారిత్రక కట్టడాలకు రక్షణ కల్పించాలని తెలంగాణ చరిత్ర బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## విధుల పట్ల నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం..కొదురుపాక స్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. ఉషారాణిపై సస్పెన్షన్ వేటు పడింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో పాటు, పాఠశాల నిధులను దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

గత కొంతకాలంగా హెచ్‌ఎం పనితీరుపై అసంతృప్తితో ఉన్న గ్రామస్థులు, పాఠశాల నిధుల విషయంలో జరుగుతున్న అవకతవకలపై గతంలోనే 'ప్రజావాణి'లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశించగా, డీఈఓ మరియు చందుర్తి ఎంఈఓలు సంయుక్తంగా విచారణ చేపట్టారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో వారు ఉన్నతాధికారులకు నివేదికను పంపారు. ఈ నివేదిక ఆధారంగా వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సదరు హెడ్మాస్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎంఈఓ శ్రావణ్ కుమార్ పాఠశాలకు చేరుకుని, సస్పెన్షన్ ఆర్డర్ కాపీని హెచ్‌ఎం కు అందజేశారు.



## ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి..

**-మోదీ సభతో బీజేపీ విజయ సంకేతాలు పంపాలి**

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సిరిసిల్ల జిల్లా నుండి ప్రజల ను భారీగా తరలించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మూడవసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నందున ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు.

కరీంనగర్ జిల్లా నుండి ఇప్పటికే 800 కార్లు, 200 బస్సుల్లో జన సమీకరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, సిరిసిల్ల జిల్లా నుండి అంతకు మించి ప్రజలు తరలివచ్చేలా చూడాలని నేతలకు సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రధానిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, భోజన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు . మోదీ సభ విజయవంతం కావడం ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం ఖాయమనే బలమైన సంకేతాలు పంపాలని ఆకాంక్షించారు.

ఈ క్రమంలోనే ప్రధాని సభకు సంబంధించి సోషల్ మీడియా, మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామాలు మరియు వార్డుల్లో వాల్ రైటింగ్స్ వేయించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు . నాయకులందరూ తమ అనుచరులు, బృందాలతో కలిసి పరేడ్ మైదానానికి చేరుకోవాలని అన్నారు. ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించనున్న 'హిందూ ఏక్తా యాత్ర' కి రాజకీయాలకు అతీతంగా జిల్లాలోని హిందువులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.




## రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి..

**ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ధాన్యం కొనుగోలు చేయాలని బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అధికారులు కోరారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా సివిల్ సప్లై అధికారి బుచ్చి బాబు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ నరసింహ, ట్రాన్స్పోర్ట్ ఇన్చార్జిలను కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా మండలంలోని రైస్ మిల్లులలో ధాన్యం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఎక్కువ మొత్తంలో ట్రాన్స్పోర్ట్ లారీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ ఏ ఎం సి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొప్పుల నగేష్ లు ఉన్నారు.

## పిఠాపురం వర్మకు షాక్

**పిఠాపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పదవి నుంచి ఎస్వీఎస్ఎన్ వర్మను తొలగించిన అధిష్టానం**

**బలగం టీవీ, అమరావతి:**



పిఠాపురం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పదవి నుంచి ఎస్వీఎస్ఎన్ వర్మను పార్టీ అధిష్టానం తప్పించింది. పార్టీ బలోపేతం, రానున్న రాజకీయ వ్యూహాల దృష్ట్యా ఈ మార్పు చేపట్టినట్లు సమాచారం. వర్మను బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు కొత్త ఇన్‌చార్జ్ నియామకంపై కూడా పార్టీ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఎస్వీఎస్ఎన్ వర్మ పిఠాపురంలో టీడీపీ తరపున కీలక నేతగా కొనసాగుతూ వచ్చారు.

---

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కార్యాలయంపై దాడి**
- **కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో భగ్గుమన్న బీజేపీ కేడర్**
- **కార్యాలయ ఫర్నీచర్, ఎమ్మెల్యే కారు ధ్వంసం**
- **13 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు**

**బలగం టీవి, కరీంనగర్**



కరీంనగర్‌లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్యాలయం వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ చిచ్చుకు దారితీశాయి. కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు మొత్తం 13 మందిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

గురువారం గంగుల కమలాకర్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్‌పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలు స్థానిక బీజేపీ శ్రేణులను ఆగ్రహానికి గురిచేశాయి. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గంగుల కార్యాలయానికి చేరుకుని దాడికి దిగారు.



**కార్యాలయం, కారు ధ్వంసం**

దాడి సమయంలో ఆందోళనకారులు తీవ్రస్థాయిలో విధ్వంసం సృష్టించారు: కార్యాలయంలోకి చొచ్చుకెళ్లిన ఆందోళనకారులు అక్కడి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును లక్ష్యంగా చేసుకుని అద్దాలు పగులగొట్టారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు.

**13 మందిపై కేసులు.. పీడీ యాక్ట్ నమోదు**

కార్యాలయం ఇన్‌చార్జి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన అనంతరం దాడికి పాల్పడినట్లు భావిస్తున్న 13 మందిపై కేసులు నమోదు చేశారు. నమోదైన సెక్షన్లు: బీఎన్ఎస్ 189, 191(3), 329(4), 324(4), 292, 351(2) తీ/ష 190 కింద కేసులు కట్టారు. నిందితులపై పీడీ యాక్ట్‌ను కూడా ప్రయోగించినట్లు పోలీసులు వెల్లడించారు.

# నేతన్నకు 'మహిళా శక్తి' భరోసా..

- **కోటి చీరల ఆర్డర్‌తో వస్త్ర పరిశ్రమకు పూర్వవైభవం..**
- **ప్రభుత్వ ఆర్డర్‌ను గడువులోగా పూర్తి చేయాలి.**
- **ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**



రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని,తెలంగాణలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమలకు కోటి ఇందిరా మహిళా శక్తి నూతన చీరల తయారీ ఆర్డర్‌ను అందజేసినట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమకు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మొత్తం కోటి చీరల ఆర్డర్ ను అందజేసే కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన రంగుల చీరలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 130 మ్యాక్స్ సంఘాలతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, జనగాం, యాదాద్రి జిల్లాలకు కలిపి మొత్తం 7 కోట్ల మీటర్ల వస్త్రం ఆర్డర్ ఇచ్చామని అన్నారు. ఇందులో 95 లక్షల సాధారణ చీరలతో పాటు, ఐదు లక్షల గోచి చీరల తయారీకి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు రాబోయే ఆరు నుండి ఏడు నెలల పాటు నిరంతర ఉపాధి లభిస్తుందని అన్నారు. పరిశ్రమను ఆర్థికంగా ఆదుకోవడంలో భాగంగా ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 352 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కృషితో వేములవాడలో 50 కోట్ల రూపాయలతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, తద్వారా నేతన్నలకు 90 శాతం క్రెడిట్‌పై నూలు అందిస్తున్నామని అన్నారు. అలాగే రూ. 5 లక్షల బీమా, రుణమాఫీ వంటి పథకాలతో నేతన్నలకు అండగా నిలుస్తున్నామని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎన్పీడీసీఎల్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని చేశారు.

హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ, తయారవుతున్న చీరల నాణ్యత పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే నాణ్యతను పాటించాలని, కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే కాకుండా యారన్ బ్యాంక్‌ను వాడుకుంటూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, స్థానిక కార్మికులు నేసిన చీరలు మహిళల ఆత్మగౌరవానికి గుర్తింపుగా నిలుస్తున్నాయని, వారి శ్రమకు తగిన

# జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత చందుర్తి



**బహుమతులను అందజేసిన ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గత నాలుగు రోజులుగా ది రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో వివిధ మండలాలకు చెందిన 10 జట్లు పాల్గొనగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చందుర్తి జట్టు నిలువగా రన్నర్ రప్ గా కోనరావుపేట గ్రేస్ టీం, మూడవ విజేతగా కోనరావుపేట డేవిడ్ వారియర్స్ టీమ్ లు నిలిచాయి, ఫైనల్ మ్యాచ్ లో కోనరావుపేట గ్రేస్ టీం పై చందుర్తి టీం ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం, ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దొమ్మటి నరసయ్య మాట్లాడుతూ ది రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం యువకులను ప్రోత్సహించేందుకు క్రీడాలు నిర్వహించాలని సూచించారు. క్రీడాలతో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ది రాజేష్ ఫౌండేషన్ చైర్మన్ కుమ్మరి రాజేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, అల్మాస్ పూర్ ఉపసర్పంచ్ కొర్రి అనిల్ కుమార్ వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, కులేరి సమాధానం, పాస్టర్లు ఏసుదాస్, మధుబాబు, దీప్తి కుమార్, శేఖర్, దానియేల్, ప్రేమ్, మధు తదితరులు పాల్గొన్నారు

## నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటన

**- పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొననున్న మాజీ మంత్రి**

**- షెడ్యూల్‌ను వెల్లడించిన జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు వివిధ మండలాలు, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరవుతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

**కేటీఆర్ పర్యటన వివరాలు ఇవే:**

ఉదయం 11:00: గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీ ముత్యాల పోచమ్మ కళ్యాణ వేడుకలు.

ఉదయం 11:30: వీర్నపల్లి మండలం బావుసింగ్ భూక్యా తండాలో జగదాంబ మాత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు.

మధ్యాహ్నం 1:30: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం.

మధ్యాహ్నం 2:00: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో శ్రీ మల్లికార్జున స్వామి కేతమ్మ కళ్యాణ మహోత్సవం.

మధ్యాహ్నం 2:30: కోరుట్లపేట గ్రామ శాఖ అధ్యక్షుడు బాలమల్లు సోదరి వివాహ వేడుక.

మధ్యాహ్నం 3:00: పెద్దూరులోని జీకే ఫంక్షన్ హాల్‌లో సీనియర్ నాయకుడు చీల అనిల్ కుమార్తె వివాహం.

ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని తోట ఆగయ్య కోరారు.

## ఏసీబీ వలలో పొత్కపల్లి పంచాయతీ కార్యదర్శి

**- ఇంటి అనుమతి కోసం ఫోన్‌పే ద్వారా లంచం డిమాండ్**

**- బాధితుడి ఫిర్యాదుతో కార్యాలయంలో అధికారుల సోదాలు**

**- నిందితుడు కుమారస్వామిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ**

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఇంటి అనుమతి మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటున్న క్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి ఏసీబీ అధికారులకు చిక్కారు.

బాధితుడి కథనం ప్రకారం.. పొత్కపల్లి గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంటి పర్మిషన్ కోసం పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా, పని పూర్తి చేసేందుకు కుమారస్వామి రూ. 5 వేల లంచం డిమాండ్ చేశారు. అయితే ఈ మొత్తాన్ని నేరుగా కాకుండా ఫోన్‌పే (గ్రాష్ట్రశీఅవూవ) ద్వారా పంపాలని సూచించడంతో, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, సీఐ తిరుపతి తమ సిబ్బందితో కలిసి పొత్కపల్లి పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. లంచం తీసుకున్నట్లు ఆధారాలు లభించడంతో కార్యదర్శి కుమారస్వామిని అదుపులోకి తీసుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు సూచించారు.

## క్యాంపు కార్యాలయంపై దాడి అమానుషం: వొడితల సతీష్ కుమార్

**బలగం టీవీ, కరీంనగర్**

కరీంనగర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు జరిపిన దాడి అత్యంత అమానుషమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మండిపడ్డారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహిస్తుండగా.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుచరులు, బీజేపీ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని ఆయన ధ్వజమెత్తారు. గురువారం క్యాంపు కార్యాలయంలోకి దౌర్జన్యంగా చొరబడి, అక్కడున్న వాహనాన్ని ధ్వంసం చేయడాన్ని సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని దుర్భాషలాడుతూ, ఆయనపై భౌతిక దాడి చేసేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. ఒక ప్రజాప్రతినిధి కార్యాలయంపై ఇలాంటి దాడులు జరగడం శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

"దేశంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన కీలక పదవిలో ఉన్న హోంశాఖ మంత్రి అనుచరులే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం ఆందోళనకరం" అని సతీష్ కుమార్ పేర్కొన్నారు. బండి సంజయ్ వెంటనే స్పందించి తన కార్యకర్తలను మందలించాలని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయనపై ఉందని సూచించారు. రాజకీయాల్లో ద్వేషాలు పెంచుకుంటే అవి మరింత ఉధృతికి దారితీస్తాయని హెచ్చరించారు. క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి, వారిపై పోలీసులు చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలపాలి తప్ప, ఇలాంటి గూండాగిరి పద్ధతులు అవలంబించడం సరైనది కాదని స్పష్టం చేశారు.

